ఈనాడు ఆదివారం: 6-11-1994

# ఒంటరితనం

నేనా ఊళ్ళో దిగేసరికి, బాగా పొద్దుపోయింది. శర్మ పేరు చెప్పగానే రిక్షావాడు, "ఇల్లు తెలుసు సార్! రాండీ" అని రిక్షా ముందుపెట్టాడు.

రాత్రి పది గంటల సమయం. ఊరు - పల్లె, పట్నం గాకుండా వుంది. వీధిదీపాలు అక్కడోటీ, ఇక్కడోటీ వెలుగుతున్నాయి. రోడ్డు.... అలా అనటానికి వీల్లేదు.... అంతా గోతులు, కంకర రాళ్ళమయం! రిక్షావాడు ఓ క్షణం తొక్కుతూ, మరోచోట లాగుతూ తీసుకుపోయాడు.

దారికిరుపక్కలా పెంకుటిళ్ళు. కొన్నయితే, ఏ గాలివానకో కూలేలా వున్నాయి.

"శర్మ, నీకు బాగా తెలుసా" రిక్షావాడిని అడిగా!

"అదేంది బాబూ! ఈ ఊళ్ళో పెద్దకామందు ఆయనేగా బాబూ! ఆర్ని తెలియని వోడు, ఈ చుట్టు పక్కల లేడు".

ఊరు చివరికొచ్చాక, రంగు రంగుల దీపాలతో, వెలుగుతున్న తెల్లమేడ చూపించి, "అది శర్మగారిదే బాబూ" అన్నాడు రిక్షావాడు.

ఆ మేడ, రంగు దీపాలు చూశాక, శర్మ చాలా ఘనంగానే 'షష్ఠిపూర్తి' చేసుకుంటున్నాడన్న భావన కలిగింది.

శర్మ, ఇంటి ముందు భాగాన వేసిన తాటాకు పందిరిలో, పడక కుర్చీలో కూర్చోనున్నాడు.

రిక్షాలోంచి దిగిన నన్ను చూసి, ఆశ్చర్యపోయాడు. గబగబా లేచి వచ్చి కౌగలించుకుని, "వచ్చావా! నువ్వు రావేమోనని అనుకుంటున్నా! కార్డుముక్క రాస్తే, బస్‌స్టాండుకు కారు పంపేవాడిని" అని లోపలకు తీసుకువెళ్ళాడు.

ఇంటినిండా బంధువులు, సామానులు. పెళ్ళి కన్నా హడావిడిగా వుంది. నన్ను చాలా వింతగా, ఆశ్చర్యంగా చూశారు అక్కడున్న వాళ్ళు!

శర్మ నన్ను సరాసరి మేడ మీదకు తీసుకుపోయి, ఓ గది తెరిపించి, "ఇది ఎ.సి.రూం! నీలాంటి మిత్రులకు ప్రత్యేకం" అన్నాడు.

గిరిజన ప్రాంతంలో మేడ, ఎ.సి. రూం!

"నువ్వు కాస్త స్నానం చెయ్యి. భోజనం పంపుతాను!" అని శర్మ వెళ్ళిపోయాడు హడావిడిగా.

నన్ను చూసినప్పట్నుంచీ, శర్మలో తొట్రుపాటు, ఆనందం, ఉద్వేగం కలుగుతున్నాయి. అది నేను గమనించాను.

స్నానం చేసి వచ్చేసరికి అయేషా నా కోసం ఎదురు చూస్తూ వుంది.

"బాగున్నావామ్మా"

ఆయేషా నవ్వింది. "చూస్తున్నావుగా అన్నయ్యా!"

నేనేం మాట్లాడలేదు.

ఆయేషా అన్నం వడ్డించింది.

"కిందకొచ్చేవాడిని గదమ్మా!" అన్నాను.

"నేనే అన్నయ్యను ఈ గదిలో ఉంచమని ఆయనతో చెప్పా. ఇందులో నాకు స్వార్థముంది!"

ఓ క్షణం ఆగి, "అన్నయ్యా! నువ్వు రావేమోనని దిగులుపడ్డా. వచ్చావు. రేపు, ఎల్లుండి ఈ తంతు మూలాన నీతో తీరిగ్గా మాట్లాడే అవకాశం దొరక్కపోవచ్చు. నువ్వు వెళ్ళే ముందు నాతో మాట్లాడి మరీ వెళ్ళు!" ఆయేషా కళ్ళల్లో నీళ్ళు! నే గమనించా!

ఆయేషా ఆవేశాన్ని నిగ్రహించుకుని నన్ను చూసి నవ్వింది.

నుదుట కుంకుమ, చేతులకు బంగారు గాజులు, మెళ్ళో నల్లపూసల తాడు, నాలుగు పేటల గొలుసు, నడుముకు వడ్డాణం, కాళ్ళకు పట్టెడ - పట్టుచీరలో ఆయేషా కొలువు తీరిన లక్ష్మీదేవిలా ఉంది. అయినా ఆమె ముఖంలో విషాద ఛాయలు చూసి నేను కలవరపడ్డాను.

"శర్మ ప్రవర్తనలో మార్పుందా?"

నా ప్రశ్నకు ఆయేషా బదులు పలకలేదు. ఆ గదిలోంచి వెడుతూ, "అన్నయ్యా! ఆయన ప్రవర్తనలో మార్పు గురించి నేనేమీ చెప్పలేను. నా కెందుకో అప్పుడప్పుడూ భయం భయంగా ఉంటుంది. కొడుకులూ, కోడళ్ళూ, మనుమలూ వున్నా ఒంటరిదాన్నే

మోనన్న భయం కలుగుతోంది. అది నా భ్రమ కావచ్చు! ఏదైనా నే తీరిగ్గా నా అంతర్యం లోని మథనం నీకు చెబుతాను. డాక్టరువిగదా! మందిస్తావో మాటలతో నా బాధ తీరుస్తావో నీ ఇష్టం!" అనంది.

కిటికీలు తెరిచా! బయట వెన్నెల! దూరంగా గోదావరి! ఆ పక్కన కొండలు. సిగరెట్ కాలుస్తూ కూర్చున్నా.

అయేషా మాటల్లోని అంతరార్థం వెతుకుతుంటే, శర్మ బాల్యం, అయేషాతో వారి వివాహం జ్ఞాపకాని కొచ్చాయి.

శర్మ, నేనూ బాల్యమిత్రులం. శర్మ నాన్న పంతులు. స్కూల్లో పాఠాలు, తీరిక సమయాల్లో వైదీకం చేసేవాడు. శర్మగాక ముగ్గురు కొడుకులు, ఇద్దరాడపిల్లలూ వున్నారు. ఒంటరి సంపాదన!

శర్మ పదో తరగతి బొటాబొటీ మార్కులతో పాసయినాడు. ఇకపై ఏం చెయ్యాలీ అన్న ప్రశ్న ఎదురైతే -

"చదివింది చాలు! హాయిగా వైదీకం నేర్చుకో! నాకు చేతోడుగా వుండు" అన్నాడు శర్మ తండ్రి.

"నే చదువుతా! లేదా అడుక్కుతింటాగానీ, దర్భలు, రాగిచెంబు పుచ్చుకుని, తద్దినాలు, పెళ్ళిళ్ళూ, బారసాలలకు పోను" అని శర్మ భీష్మించుకున్నాడు.

"అడుక్కు తిను. చదివించడం నావల్లగాదు! ఇంకా పిల్లలున్నారు. వాళ్ళకు చదువులు, పెళ్ళిళ్ళూ చెయ్యాలి. నీతోనే సరిగాదు. పైగా చదివినా వచ్చే గుమాస్తా వుద్యోగం నీకే సరిపోతుంది. తోడబుట్టినవాళ్ళు వీధిన పడతారు. కనుక వైదీకం నేర్చుకో! ఇంటి పట్టున వుండొచ్చు!" అని శర్మ తండ్రి చెప్పి చూశాడు.

శర్మ వినలేదు.

నేను కాలేజీలో చేరేందుకు వెళ్ళా. ఆ సమయంలో శర్మ ఓసారి కలిశాడు.

"నాకేదన్నా సలహా చెప్పరా!"

నేనేం చెప్పేది. తండ్రీ కొడుకుల వాదనల్లో నిజం ఉంది. పైగా సలహా చెప్పే వయస్సు గాదు!

ఆ తర్వాత నేను ఎం.బి.బి.ఎస్ చదవటానికి వేరే రాష్ట్రం వెళ్ళిపోయా. దానాదీనా కొన్నాళ్ళు శర్మ సంగతులు, వాళ్ళూ, వీళ్ళూ విన్నవీ, కన్నదీ, కర్ణాకర్ణిగా తెలిసేవి.

శర్మ, ఊరొదిలి వెళ్ళిపొయ్యాడు. హోటల్లో సర్వరుగా చేరాడని, రాజమండ్రి కోటి లింగాల రేవులో ముష్టెత్తుకుంటున్నాడనీ, సినిమా హాల్లో పనిచేస్తున్నాడనీ - ఇలా వదంతులు విన్నాను. ఇవన్నీ నిర్ధారణ కాలేదు.

శర్మ ఏమైనాడో, ఏం చేస్తున్నాడో ఎవ్వరికీ, ఆఖరికి, కన్నవారికీ తెలియదు.

కొన్నాళ్ళు శర్మ తండ్రి, కొడుకు ఇల్లు వదలిపొయ్యాడని ఖస్సు బుస్సుమన్నా ఆ

తర్వాత ఏదో పోగొట్టుకున్న వాడిలా ఉండేవాడు. ఆయన నిత్యకృత్యం జరుపుకుంటున్నా కొడుకు లేడే అన్న బాధ ముఖంలో స్పష్టంగా కనపడేది.

నేను ప్రభుత్వ కొలువులో జేరితే ఏజెన్సీ ప్రాంతంలో డాక్టరుగా పంపారు. ఉద్యోగరీత్యా గోదావరి దాటుతుండగా, అకస్మాత్తుగా శర్మ లాంచీలో కలిశాడు.

పరామర్శలయ్యాక శర్మ తన వివరాలు చెప్పాడు.

ఇల్లొదిలాక సర్వరూ, సినిమా హాల్లో ఉద్యోగం - ఇలా నానా అవతారాలు ఎత్తినమాట నిజం. వరదకు కొట్టుకుపొయ్యే దుంగలా, జీవిత ప్రవాహంలో పడి ఏజెన్సీ ప్రాంతంలో కలప వ్యాపారం చేసే చందన్‌ఖాన్ దగ్గర గుమాస్తాగా కాలం గడుపుతున్నానని చెప్పాడు.

"మీ నాన్న నీ కోసం దిగులు పడ్డాడు! కనీసం ఉత్తరాలన్నా రాస్తున్నావా?"

శర్మ సమాధానం చెప్పలేదు.

ఆ తర్వాత శర్మ రాజమండ్రి వెడుతూ, వస్తున్నప్పుడు నా దగ్గర కొచ్చేవాడు.

అలా వస్తున్నప్పుడే ఓసారి మెరుపులా వచ్చి తన పెళ్ళి గురించి వార్త చెప్పి నా సలహా అడిగాడు.

చందన్‌ఖాన్ ఉత్తరప్రదేశ్ ముస్లిం. ఏజెన్సీ ప్రాంతంలో కలప వ్యాపారం చేస్తున్నాడు. కొడుకులు చదువుకుని ఏజెన్సీ వదిలి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అందరిలోకి ఆఖరిపిల్ల ఆయేషా. తల్లి లేదు, తండ్రికి వృద్ధాప్యం వచ్చేసింది. ఎలా సంభవించిందో తెలియదు లేదా శర్మ చెప్పలేదు. ఆయేషా, శర్మ ప్రేమించుకున్నారు. పెళ్ళి దాకా వచ్చింది.

"చందన్‌ఖాన్ ఏమంటాడు?"

"ఆయనకీ పెళ్ళి ఇష్టం లేదు. మతాలు వేరని కాదు. చందన్‌ఖాన్ వ్యాపారం ఎత్తేసి, లక్నో వెళ్ళిపోవాలని ఉద్దేశం. కొడుకులూ, కూతుళ్ళూ అందరూ అక్కడే ఉన్నారు. తనొక్కడు ఇక్కడుండి చేసేదేం లేదు. ఆఖరి కూతుర్ని కూడా తన మతస్తులకే ఇచ్చి, తన దగ్గరే ఉంచుకోవాలని ఉద్దేశ్యం!"

"మరి ఆయేషా ఏమంటుంది?"

"ఆ పిల్ల పుట్టిపెరిగింది ఇక్కడే. పైగా నా ప్రేమ ఒకటి! అందుకని ఇక్కడే వుంటానంటోంది?"

"ఈ పెళ్ళి వల్ల నువ్వు లాభపడతావా?"

నా ప్రశ్న శర్మకు మింగుడుపడలేదు. లేదా అలా నటించాడు.

"ఆయేషాని ప్రేమించిన మాట నిజం. ఇక లాభమంటావా? చందన్‌ఖాన్ వ్యాపారం ఎత్తేసినా, భూమి, ఇల్లయినా కూతురి కిస్తాడనే నా నమ్మకం! అలా జరిగితే నాకు లాభమే! ఆయన పేరు, ఇన్నాళ్ళు ఆయన దగ్గర గుమాస్తాగా గడించిన అనుభవంతో బతగ్గలను!"

"మరి ఈ పెళ్ళికి మీవాళ్ళు ఒప్పుకోరేమో?"

"ఏం సందేహం వద్దు. ఒప్పుకోరు. ఇంతకాలమూ వాళ్ళకు నే చేసిన సాయం ఏం లేదు. రాకపోకలూ లేవు. చూద్దాం ముందేం జరుగుతుందో?"

శర్మ పెళ్ళికి నే వెళ్ళా. అతగాడి బంధువులు ఎవ్వరూ రాలేదు. దండల మార్పిడి పెళ్ళి. చందన్‌ఖాన్ పరిచయస్తులు కాక, నాబోటి వాళ్ళే మరికొందరు ఆ పెళ్ళికి వచ్చారు. విందులో చందన్‌ఖాన్ పరిచయమయ్యాడు.

చందన్‌ఖాన్ భారీ విగ్రహం. డెబ్బయ్యేళ్ళ పైమాటే. గోధమ రంగు జుత్తు, గడ్డం, నిశితంగా చూసే కళ్ళు, షేర్వాణీ, పైజామాలో రాజ్యం పరిగ్రహించిన పాదుషాలా ఉన్నాడు.

"భాయిసాబ్! శర్మాజీ మంచోడు. కష్టపడి పనిచేస్తాడు. నమ్మకస్తుడు కూడా. కానీ బామ్మన పిల్లగాడు. అడి అమ్మ నాయినా ఎవ్వరూ శర్మాజీకి దగ్గరగా రారు ఈ పెళ్ళి వల్ల. ఏం బావుకుంటాడు. మా ఆయేషా తల్లి లేని పిల్ల. ఎలా బతుకుతుందో?" అన్నాడు.

"మీరేం సాయం చెయ్యదా?"

"చేస్తా డాక్టరు సాబ్. చేస్తా. కానీ నే బతికేది ఎన్నాళ్ళు. పైగా ఇక్కడ వుండను. ఇక కొడుకులదే అజమాయిషీ. నే అక్కడ వుండి ఇక్కడ బాగోగులు చూడలేనుగా! అంతా అల్లా దయ! మీలాంటి వాళ్ళు మా అమ్మాయిని కనిపెట్టి వుండాలి!"

ఆయేషా చిలకలా నవ్వుతూ వుంది పెళ్ళిలో. శర్మ నన్ను పరియం చేస్తే, "అన్నయ్యా! పుట్టిల్లు గుర్తుకొస్తే నీ దగ్గరకొస్తా! ఏం?" అంది ఆప్యాయంగా.

చందన్‌ఖాన్, శర్మకు ఇల్లు, పొలం, వ్యాపారం అప్పజెప్పి వెళ్ళిపొయ్యాడు. వెళ్ళి కొద్ది కాలానికే చనిపోయాడు. దాంతో ఆయేషా కన్నవాళ్ళకు శాశ్వతంగా దూరమైంది.

శర్మ ఆయేషా - మర్చిపొయ్యా, ఆయేషా అన్నపూర్ణగా పేరు మార్చేశాడు శర్మ-అప్పుడప్పుడు నా దగ్గరకు వచ్చేవాళ్ళు చుట్టపు చూపుగా!

"మీ నాన్నను వెళ్ళి చూసొచ్చావా?" అనడిగా శర్మనోసారి.

శర్మ ముఖం కందగడ్డలా చేసుకుని, "ఆహా వెళ్ళా. ముసలాడు పక్షవాతంతో మంచాన పడ్డాడని తెలిసి వెళ్ళా. నన్నూ, నా భార్యనూ చూడగానే మొహం తిప్పుకున్నాడు. అమ్మ మటుకు 'ఏం కులమైతేనేం పిల్ల లక్ష్మీదేవిలా వుందని' అన్నది. నాకక్కడ వుండబుద్ధిగాలా! వచ్చేశా! మళ్ళీ పోలేదు".

ఆయేషా, శర్మ మాటలకు నవ్వింది. "అన్నయ్యా, ఈయనకు ఆవేశం ఎక్కువ. మామ గారు పాతకాలం మనిషిగదా. ఓ పట్టాన నన్ను కోడలుగా అంగీకరించలేరు. అందులో తప్పేముంది? అంతెందుకు ఈయన మటుకు ఈయన ఓసారి లక్నో వచ్చినా బలవంతాన మా అన్నగారింట్లో భోజనం చేయటానికి నానా యాగీ చేసి వచ్చేశారు! మళ్ళీ వెళ్ళలేదు! అలాంటిది మామగారు మొహం తిప్పుకున్నారంటే తప్పేముంది? పోతూ, వస్తుంటే సంబంధం కొనసాగుతుంది" అన్నది.

అనాడే అనుకున్నా ఆయేషా, శర్మకు లభ్యమైన అపురూపమైన కానుక అని! ఆ

అమ్మాయిలో వివేచన, విచక్షణ, లోకపరిశీలన ఉన్నాయని!

కానీ ఇవ్వాళ, ఇన్నేళ్ళ తరువాత ఆయేషాలో దుఃఖం, ఆవేదన చూసి, నా మనస్సు కలుక్కుమంది. అందుకే గతమంతా లీలామాత్రంగా జ్ఞాపకం వచ్చింది.

అలా ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయా. ఆ తర్వాత తెల్లవారేందుకు అట్టే సమయం లేదు. కానీ నిద్ర బద్ధకం ఎక్కువై తలుపులు బిడాయించుకున్నా. కిందనుంచి వినవస్తున్న మేళ తాళాలు, మంత్రాలు అన్నీ కలలోలాగానే ఉన్నాయి.

◆ ◆ ◆

రెండు రోజులు నేను ప్రేక్షకుడిగానే మిగిలిపొయ్యాను.

హోమాలు, జపాలు, గోదావరి స్నానాలు, దానాలు... ఈ కార్యక్రమంలో శర్మ, ఆయేషా, సోమయాజులు, సోమిదేవమ్మాలా తయారైనారు.

శర్మ తమ్ముళ్ళు, చెల్లెళ్ళూ, వాళ్ళ పరివారమంతా షష్ఠిపూర్తికి వచ్చారు. శర్మ తల్లి కూడా వచ్చింది. ఆమెకు చూపు ఆనదు. నేనే వెళ్ళి పలకరించా!

"ఏదో నాయనా! ఇన్నాళ్ళూ వీడొక్కడు వేరే అయినాడే అని బాధపడ్డా. వాడు తప్పు తెలుసుకుని, మళ్ళీ కుటుంబంలో ఒకటైనాడు!" అనంది.

షష్ఠిపూర్తి కార్యక్రమం పూర్తయ్యేసరికి ఆయేషా, వడలిన తోటకూరలాగైంది.

నే ప్రయాణమవుతున్నానని తెల్సి ఆయేషా నా దగ్గరకొచ్చింది. ఆమె మొహంలో కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్ల మధ్య షష్ఠిపూర్తి ఘనంగా చేసుకున్నామన్న సంతోషం లేదు.

"బాగా జరిగిందమ్మా" అన్నా.

ఆయేషా నవ్వింది జీవచ్ఛవంలా.

"మీ వాళ్ళందర్నీ వదులుకుని, శర్మతో జీవితం పంచుకున్నందుకు సార్ధకత కూడా కలిగింది. మా శర్మ అదృష్టవంతుడు".

"అంటే నే కాదన్నమాటేగా?"

ఆయేషా ప్రశ్నకు నే ఖంగుతిన్నా.

"నా ఉద్దేశ్యం అదిగాదు."

"అన్నయ్యా!..... నువ్వు తప్ప నాకెవరున్నారు చెప్పు - మనసు విప్పి చెప్పుకునేందుకు! నే చెప్పేది మనసులో దాచుకో!"

"శర్మను ప్రేమించాను. ఎందుకంటే వరదకు కొట్టుకొచ్చిన దుంగలా ఉన్నాడు శర్మ మా ఇంటికి చేరేసరికి.

అన్నం పెట్టి ఆశ్రయమిచ్చాక తెలిసింది బ్రాహ్మడని! మా నాయిన నొచ్చుకున్నాడు. కులం చెడగొడుతున్నామని.

'నాకు బతకడం ముఖ్యం. కులం, మతం గాదు!' అన్నాడు శర్మ.

"మాతో తిన్నాడు! ఉన్నాడు. చెప్పిన పనులన్నీ చేశాడు. చెప్పకుండా పనులందుకుని చేసేవాడు.

మా నాన్న అభిమానించాడు.

నేను ప్రేమించాను.

అందుకే, అందర్నీ వదులుకుని, శర్మతో జీవితం పంచుకున్నాను.

మా పెళ్ళికి నువ్వొచ్చావు! మా పెద్దబ్బాయికి నువ్వు పురుడు పోశావు.

ఆ తర్వాత నువ్వు ఉద్యోగరీత్యా దూరమయ్యావు. నీకు తెలియని సంగతులున్నాయి. ముఖ్యంగా నే చెప్పాలనుకున్నది. మీ శర్మ నన్ను ఒంటరిదాన్ని చేశాడు.

తన చుట్టూ గిరిగీసుకుని, మతం, ఆచారాలు, మూఢనమ్మకాలు పెంచుకున్నాడు.

ఎందుకింతగా మారిపొయ్యాడో నా కర్థంగావడం లేదు.

ఆయన, పిల్లలు ఒకటి! నేను అంటరానిదానిగా తయారవుతున్నాను.

ఎందుకలా జరుగుతున్నది? నా కర్థంగావడం లేదు.

నా ఆలోచనలో జడత్వం వచ్చిందా? అన్న అనుమానమూ ఉంది.

నన్నేం చెయ్యమంటావు?"

ఆయేషా.... గాలివానకు తడిసిన గువ్వలా కనిపించింది నాకు!

ఆమె కళ్ళల్లో దుఃఖఛాయలు చూడటం నాకిదే ప్రథమం.

పుచ్చపువ్వులా, అడవి మల్లెలా, శ్రావణమాసపు వెన్నెల లాంటి.... ఆయేషా! ఎందుకింతగా 'ఒంటరితనం'తో బాధపడుతున్నది.

శర్మలో స్వార్థం, ఏదో పోగొట్టుకున్నానన్న భావన కారణమా? ఏమో?

"అమ్మా! నాకు కొంచెం వ్యవధి ఇవ్వు! నా సమాధానం చెబుతాను. తొందరపడి జీవితాన్ని దుఃఖమయం చేసుకోకు!" అన్నా.

ఆయేషా నవ్వింది.

"ఏ అఘాయిత్యము చెయ్యనులే" అన్నది.

శర్మ నాతో వచ్చాడు సాగనంపటానికి. వాడి అవతారం చూస్తే నిత్యాగ్నిహోత్రుడిలా, అర్షధర్మ ప్రతినిధిలా వున్నాడు.

"అన్నపూర్ణ ఎందుకో నా నుంచి దూరమవుతున్నదిరా! ఏమడిగినా చెప్పదు!"

నాకు కోపం వచ్చింది. తమాయించుకున్నాను.

"ఇది వరకు ఏదన్నా చెబితే అలా కాదు, ఇలా చేద్దాం అనేది. ఎందుకో ఈ మధ్య అన్నీ మౌనంగా విని ఊరుకుంటోంది. నాకేంచెయ్యాలో తోచడం లేదు" అన్నాడు శర్మ.

'ఒరేయ్ శర్మా! ఆయేషా నీకు దొరికిన నిధిరా! ఆ నిధిని అలక్ష్యం చేసి అనాథగా మిగలకు!' అని చెబుదామనుకున్నా. కానీ చెప్పలేదు!

ఎందుకంటే శర్మ అవతారం చూస్తే వాడు వింటాడని నమ్మకం లేక. ●